సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శనివారం, 4, ఫిబ్రవరి, 2023



జీవాల ప్రాణాలకు సీఎం జగన్ భరోసా

డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ అంబులెన్స్ సేవలను అరకు ఎమ్మెల్యే పాల్గుణ ప్రారంభించారు.

8లో



విహారయాత్రలో విషాదం

మారేడుమిల్లి–చింతూరు ఘాట్ రోడ్డులో లారీ అదుపుతప్పి లోయలో పడింది. ఇద్దరు మృతి చెందారు. నలుగురు గాయపడ్డారు.

8లో

ఎయిర్ ఇండియా కొత్త సర్వీసులు



విశాఖ: ఎయిర్ ఇండియా సంస్థ ఢిల్లీ, ముంబైలకు విశాఖ నుంచి రెండు విమాన సర్వీసులు నడపనుంది. ఈనెల 13 నుంచి రోజూ ఇవి అందుబాటులో ఉంటాయి.

న్యూస్‌రీల్

ధాన్యం కొనుగోలు టార్గెట్ పెంచాం

- సివిల్ సప్లయ్స్ డీఎం గణేష్‌కుమార్



లబ్బర్తిలో ధాన్యం స్టాక్ బస్తాలను చూపుతున్న రైతు

రాజవొమ్మంగి: జిల్లాలో ధాన్యం కొనుగోళ్లకు అడిషనల్ టార్గెట్ నిర్ణయించామని సివిల్ సప్లయ్స్ డీఎం గణేశ్‌కుమార్ తెలిపారు. లక్ష్యం మేరకు జిల్లాలో ఇప్పటికే 23,000 టన్నుల ధాన్యం కొనుగోలు పూర్తయ్యిందన్నారు. మరో 3,700 టన్నుల టార్గెట్‌ను ప్రభుత్వం ప్రకటించిందన్నారు. రాజవొమ్మంగి మండలంలోని రైతులు తమ వద్ద ధాన్యం నిల్వలు పేరుకుపోయాయని శుక్రవారం స్థానిక వ్యవసాయ అధికారి రమేష్‌నాయుడు దృష్టికి తెచ్చారు. దీంతో ఏవో సంప్రదించిన మేరకు సివిల్ సప్లయ్స్ డీఎం పై విధంగా స్పందించారు. ప్రధానంగా మండలంలోని వాతంగిలో వంద టన్నులు, శరభవరంలో 60 టన్నులు, లబ్బర్తిలో 90 టన్నులు, దూసరపాములో వంద టన్నులు, జడ్డంగిలో 60 టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. రైతులు ఆందోళన చెందవద్దని, ధాన్యం నిల్వల మేరకు కొనుగోలు ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు.

మన్యంకొండ జాతర ఏర్పాట్లపై ఇరు రాష్ట్రాల సమీక్ష



సమావేశంలో పాల్గొన్న అధికారులు, జాతర కమిటీ సభ్యులు

మోతుగూడెం: ఆంధ్ర, ఒడిశా రాష్ట్రాల గిరిజనుల ముఖ్య పండగ ముత్యాలమ్మ తల్లి (బడయాత్ర) జాతర ఈ నెల 27న జరగనున్న నేపథ్యంలో ఇరు రాష్ట్రాల అధికారులు, జాతర కమిటీ సభ్యులు శుక్రవారం ఒడిశాలోని మల్కనగిరిలో సమావేశం నిర్వహించారు. మల్కన్‌గిరి సబ్ కలెక్టర్ అక్షమ్‌కుమార్, ఎమ్మెల్యే అజిత్ కుమార్‌ల ఆధ్వర్యంలో జాతర ఏర్పాట్లుపై సమీక్షించారు. ఈ జాతర జరిగే పొల్లూరు జలపాతం వద్ద ఏర్పాట్లు, సీలేరు నది వద్ద అమ్మవారు పడవ దాటే ప్రదేశంలో శుభ్రత, శానిటేషన్, తదితర ఏర్పాట్లు గురించి, భక్తులకు భోజన సదుపాయాలు తదితర అంశాలపై చర్చించారు. తదుపరి సమావేశం ఆంధ్రాలో నిర్వహించి ఏర్పాట్లుపై కార్యాచరణ తెలియజేస్తామని జాతర కమిటీ నిర్వాహకులు తెలిపారు. చింతూరు ఎంపీడీవో రవిబాబు, మోతుగూడెం ఏపీ జెన్‌కో సివిల్ ఏడీఈ కొండలరావు, మోతుగూడెం ఎస్‌ఐ రాజేశ్వరరావు, జాతర కమిటీ సభ్యులు మల్లికార్జున్, వరప్రసాద్ కుమార్ పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తులు

పాడేరు రూరల్: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అసిస్టెంట్ బ్యూటీషియన్ థెరపిస్ట్ కోర్సు, జనరల్ డ్యూటీ అసిస్టెంట్ కోర్సుకు ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డీఎస్‌డీవో రోహిణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ చదివిన అభ్యర్థులకు రంపచోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మూణ్నెల్ల పాటు ఉచితంగా శిక్షణ అందించి సర్టిఫికెట్లను జారీ చేస్తామన్నారు. 6301534435 సంప్రదించాలన్నారు.



జి.మాడుగుల సమీపంలో పసుపును ఉడకబెడుతున్న గిరిజన రైతు

గిరిజన రైతుకు అభయం

- పసుపు పంటకు గిట్టుబాటు ధర కల్పనే లక్ష్యం
- పెద్ద వ్యాపారులతో కలెక్టర్ మంతనాలు
- ఆర్డర్ల ప్రకారం కొనుగోలుకు వ్యూహం

గిరిజన రైతులకు శుభవార్త.. ఎండావానలనక కష్టనష్టాల కోర్చి పంట పండించి మార్కెట్‌కు తీసుకెళ్తున్న మీ రెక్కల కష్టం వృథా పోదు. కారుచౌకగా కొల్లగొడుతున్న దళారుల మోసాలకు చెక్ పెట్టేందుకు అధికార యంత్రాంగం రంగంలోకి దిగింది. పసుపు అమ్మకంలో మంచి లాభాలు ఇవ్వాలనే లక్ష్యంతో చర్యలకు ఉపక్రమించింది.



పసుపును ఎండబెట్టి నేల రాస్తున్న గిరిజనులు

సాక్షి, పాడేరు: ఏజెన్సీలో గిరిజన రైతులు సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తున్న నాణ్యమైన పసుపు పంటకు గిట్టుబాటు ధర కల్పన లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోంది. పెద్ద వ్యాపారులకు మన్యం పసుపును నేరుగా గిరిజనులు విక్రయించేందుకు కలెక్టర్ సుమిత్‌కుమార్ అధ్యక్షతన అధికార యంత్రాంగం వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. ఏజెన్సీలో అష్టకష్టాలు పడి సాగు చేస్తున్న పసుపునకు రెండేళ్ల నుంచి గిట్టుబాటు ధరలు కరువయ్యాయి. ప్రస్తుతం పసుపు అమ్మకాల సీజన్ ప్రారంభమై రెండు వారాలు కావస్తున్నా, దళారులు మాత్రం కారుచౌకగా కొనుగోలు చేస్తుండడంతో గిరిజన రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏజెన్సీలో 25 వేల ఎకరాల విస్తీర్ణంలో పసుపు సాగు చేస్తున్నారు. మూడేళ్ల క్రితం మన్యం పసుపును కిలో రూ.100తో వ్యాపారులు కొనుగోలు చేసేవారు. ఈ క్రమంలో తమ వద్ద నిల్వలు పేరుకు పోయాయనే సాకుతోపాటు లాక్‌డౌన్ ప్రభావం పసుపుపై పడింది. దీంతో వ్యాపారులంతా కిలో రూ.70కు మించి పసుపు కొనుగోలు చేయకపోవడంతో గిరిజనులు ఆర్థికంగా నష్టపోతున్నారు.

దళారుల మోసాలకు చెక్ లక్ష్యం

ఏజెన్సీలో గిరిజన రైతులు సాగు చేసిన పసుపు నాణ్యతలో దేశంలోనే నంబర్‌వన్‌గా నిలుస్తోంది. మన్యంలో కొనుగోలు చేసిన పసుపు మొత్తాన్ని తమిళనాడులో ఈరోడ్ ప్రాంతంలోని పెద్ద పసుపు ట్రేడర్లకు రవాణా చేస్తుంటారు. అక్కడ అన్ని ప్రాంతాల పసుపు కన్నా అల్లూరి సీతారామరాజు జిల్లాలో సాగయ్యే పసుపునకు మంచి డిమాండ్ ఉంటోంది. అయితే స్థానిక దళారులతోపాటు మైదాన ప్రాంత వ్యాపారులు కిలో రూ.70కు మించి కొనుగోలు చేయడం లేదు. ఈ నేపథ్యంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ పలు శాఖల అధికారులతో ఇటీవల వారపు సంతల్లో పసుపు విక్రయాలు, వ్యాపారులు అమలు జేస్తున్న ధరలపై సమగ్ర విచారణ చేయించారు. వారిచ్చిన నివేదిక ఆధారంగా పసుపునకు మద్దతు ధర కరువైందని కలెక్టర్ నిర్ధారించారు. ఎకరా పంటలో 150 కిలోల వరకు పసుపును అమ్ముకునే పరిస్థితితో రైతులకు మంచి లాభాలు ఇవ్వాలనే లక్ష్యంతో చర్యలు చేపట్టారు. ఈ మేరకు వి.మాడుగులతో పాటు, పలు పెద్ద ట్రేడర్ల యజమానులతో ఇటీవల సమావేశం నిర్వహించారు. జాతీయ మార్కెట్‌లో పసుపు ధరలు, మన్యం పసుపుకు ఉన్న నాణ్యత, డిమాండ్, రెండేళ్లలో నిల్వలు వంటి అంశాలపై క్షుణ్ణంగా సమీక్షించారు. ట్రేడర్లు ముందుకు వస్తే ఆయా ఆర్డర్లు బట్టి నాణ్యమైన పసుపును సంతల్లో కొనుగోలు చేసేందుకు కలెక్టర్ నిర్ణయించారు. కనీసం కిలోకు రూ.85 నుంచి రూ.90 ధరతో గిరిజన రైతులు పసుపును అమ్ముకోవాలనే ఆశయంతో ఉన్నారు.

గిట్టుబాటు ధరతోనే పసుపు విక్రయాలు



గిరిజన రైతులు తాము సాగు చేసిన పసుపును గిట్టుబాటు ధరతోనే అమ్ముకోవాలి. దళారుల తప్పుడు తూకం, తగ్గింపు ధరతో కొనుగోలు వంటి మోసాలపై రైతు లు అవగాహన పెంచుకోవాలి. పెద్ద వ్యాపారులంతా గిరిజనుల పసుపునకు గిట్టుబాటు ధర కల్పించాలని తగిన ఆదేశాలిచ్చాం. దళారులు మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం.

– సుమిత్‌కుమార్, కలెక్టర్

ఐటీడీఏలో స్పందనకు అర్జీల వెల్లువ



అర్జీలు స్వీకరిస్తున్న జేసీ శివ శ్రీనివాస్, సబ్ కలెక్టర్ అభిషేక్, అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ

పాడేరు రూరల్: ఐటీడీఏలో శుక్రవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి అర్జీలు వెల్లువెత్తాయి. స్పందన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్, సబ్ కలెక్టర్ అభిషేక్, అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ మండలాల నుంచి మొత్తం 76 అర్జీలు వచ్చాయి. ప్రధానంగా తాగునీటి, విద్యుత్, భూ సమస్యలు, రహదారి సదుపాయాలు, ఉపాధి అవకాశాలు కల్పించాలని, దుకాణాల ఏర్పాటుకు ప్రభుత్వ స్థలాలు ఏర్పాటుపై పలువురు గిరిజనులు అర్జీలు సమర్పించారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వి.వి.ఎస్ వర్మ, గిరిజన సంక్షేమ శాఖ డీడీ కొండలరావు, గిరిజన సంక్షేమ శాఖ ఈఈ డీవీఆర్ఎం రాజు, డీఎల్‌పీవో పీఎస్ కుమార్, పంచాయతీరాజ్ ఈఈ లావణ్యకుమార్, డీఎంహెచ్‌వో డాక్టర్ జమల్ బాషా, ఎల్‌డీఎం రవికిరణ్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

అటవీ ఉత్పత్తుల కొనుగోళ్లు పెంచండి

- జీసీసీ రంపచోడవరం డివిజినల్ మేనేజర్ పార్వతీశ్వరరావు



జీసీసీ చౌక డిపోల సేల్స్‌మెన్ల సమావేశంలో మాట్లాడుతున్న డీఎం పార్వతీశ్వరరావు

రాజవొమ్మంగి: ప్రతి జీసీసీ చౌకడిపో పరిధిలో కలపేతర అటవీ ఫలాల (అటవీ ఉత్పత్తుల) కొనుగోళ్లు పెంచాలని జీసీసీ రంపచోడవరం డీఎం పార్వతీశ్వరరావు కోరారు. శుక్రవారం స్థానిక గిరిజన ప్రైమరీ మార్కెటింగ్ సొసైటీ కార్యాలయంలో ఆయన సేల్స్‌మెన్స్, ఇతర సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కరక్కాయలు, కుంకుడు కాయలు, తేనె, నల్ల జీడిపిక్కలు, ముషిణి గింజలు తదితర అన్ని అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేసి, వారికి వెన్వెంటనే సొమ్ము చెల్లించాలని ఆదేశించారు. అదేవిధంగా చౌకడిపోల్లో బెల్లం, చింతపండు, కంది, పెసరపప్పు, వంటనూనెల అమ్మకాలు పెంచాలని సూచించారు. ఇప్పటికే అందుబాటులోకి వచ్చిన జీసీసీ ఉత్పత్తులను ప్రజలకు చేరువ చేస్తూ విక్రయించాలన్నారు. డివిజన్‌లో రాజవొమ్మంగి, అడ్డతీగల, రంపచోడవరం, మారేడుమిల్లి, పశ్చిమగోదావరి జిల్లాలోని కేఆర్ పురంల లో జీసీసీ సొసైటీలు ఉన్నాయన్నారు. అటవీ ఉత్పత్తుల కొనుగోళ్లు, వాటిని శుద్ధి చేసి వాల్యూ ఏడెడ్ ప్రొడక్ట్స్‌గా మార్చి తిరిగి ప్రజలకు విక్రయించడం ద్వారా జీసీసీ తన వ్యాపారాన్ని ఇటు మన్యంలోను, అటు మైదాన ప్రాంతంలోను విస్తరిస్తోందన్నారు. అనంతరం కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. స్థానిక జీసీసీ మేనేజర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఆర్ఐవోగా ఉమారాణి



విశాఖ విద్య: ఇంటర్మీడియెట్ విద్య ప్రాంతీయ పర్యవేక్షణ అధికారిగా పోసుపు ఉమారాణి నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఆమె బాధ్యతలు చేపట్టారు. భీమిలి ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న ఉమారాణికి ఆర్ఐవోగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఇంటర్మీడియెట్ బోర్డు కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు ఆర్ఐవోగా వ్యవహరిస్తున్న ఆర్.సత్యనారాయణ నుంచి ఆమె బాధ్యతలు తీసుకున్నారు. ఉమారాణికి కార్యాలయ అధికారులు, ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

జాబ్ కార్డుదారులకు 100 రోజుల పని దినాలు

- ఉపాధి హామీ పథకం విజిలెన్స్ డిప్యూటీ కమిషనర్ మల్లికార్జునరెడ్డి
- ఏజెన్సీలో ఉపాధి పనుల పరిశీలన



మాట్లాడుతున్న ఉపాధి హామీ పథకం విజిలెన్స్ డిప్యూటీ కమిషనర్ మల్లికార్జునరెడ్డి

పాడేరు రూరల్: జాబ్ కార్డు కలిగిన ప్రతి గిరిజన కుటుంబానికి తప్పనిసరిగా వంద రోజుల ఉపాధి పనులు కల్పించాలని ఉపాధి హామీ పథకం విజిలెన్స్ డిప్యూటీ కమిషనర్ మల్లికార్జునరెడ్డి ఆదేశించారు. శుక్రవారం ఆయన పాడేరు, అరకు ప్రాంతాల్లో పలుచోట్ల ఉపాధి పనులను పరిశీలించారు. అనంతరం పాడేరు కాఫీ గెస్ట్ హౌస్‌లో 11 మండలాల ఎంపీడీవోలు, ఉపాధి ఏపీడీలు, ఈసీలు, క్షేత్ర స్థాయి సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పనులు గుర్తించి జాబితాలను సిద్ధం చేసుకోవాలన్నారు. జాబ్ కార్డుదారులందరికీ పనులు కల్పించి సకాలంలో కూలి సొమ్ము అందేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అడిగిన ప్రతి గిరిజన కుటుంబానికి తప్పనిసరిగా ఉపాధి పనులు కల్పించాలన్నారు. ఏజెన్సీలోని కొన్ని గ్రామాల్లో ఉపాధి పనులు సక్రమంగా చేయడం లేదని తన దృష్టికి వచ్చిందన్నారు. ఇందులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అటవీ హక్కు పత్రాలు పొందిన గిరిజన కుటుంబాలకు 150 రోజుల పని దినాలు కల్పించాలన్నారు. సిబ్బంది రోజూ క్షేత్ర పర్యటనలు చేసి పనులను పర్యవేక్షించాలన్నారు. వేతనదారుకు రోజుకు రూ.257 కూలి అందేలా పనులు చేయించాలని ఆదేశించారు. డ్వామా పీడీ రమేష్ రామన్, ఉపాధి ఏపీడీలు జవ్వాది గిరిబాబు, రామారావు, పాడేరు ఎంపీడీవో సాయినవీన్, డీబీటీ మేనేజర్ నరేంద్రకుమార్‌నాయక్ పాల్గొన్నారు.

తిరుపతి లడ్డూ తయారీకి సేంద్రియ బెల్లం

కోటవురట్ల: తిరుపతి లడ్డూ తయారీకి సేంద్రియ బెల్లం ఉపయోగించాలని యోచిస్తున్నట్లు రాష్ట్ర మార్క్‌ఫెడ్ ఎండీ, మార్కెటింగ్ శాఖ కమిషనర్ రాహుల్ పాండే తెలిపారు. శుక్రవారం ఆయన రాజుపేటలో సేంద్రియ బెల్లం తయారీ పరిశ్రమను సందర్శించారు. ఇక్కడ బెల్లం తయారు చేసే విధానం, పాడవకుండా చేపట్టే చర్యలు, జాగ్రత్తలను పరిశ్రమ యజమాని వేగి శ్రీనివాసరావు అధికారులకు వివరించారు. విదేశాలకు సైతం ఎగుమతి చేస్తున్నామని వివరించారు. ఈ బెల్లాన్ని పరిశీలించిన అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. తొలివిడతగా ఈ ఏడాది 150 టన్నుల బెల్లం కొనుగోలు చేయనున్నట్లు మార్కెటింగ్ అధికారులు తెలిపారు. రైతు సాధికార సమితి డీపీఎం లచ్చన్న, మార్కెటింగ్ అధికారులు ఉన్నారు.

కేకే లైన్‌లో యథావిధిగా రైళ్ల రాకపోకలు



కేకేలైన్‌లోని పునరుద్ధరణ పనులను పర్యవేక్షిస్తున్న రైల్వే డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి

అనంతగిరి: మండలంలోని కొత్తవలస–కిరండూల్ (కేకే లైన్)లో శుక్రవారం మధ్యాహ్నం నుంచి యథావిధిగా రైళ్ల రాకపోకలు సాగుతున్నాయి. ఇక్కడ శివ

పూర్తయిన పునరుద్ధరణ పనులు

లింగపురం రైల్వే స్టేషన్ యార్డులోని గురువారం ఉదయం గూడ్సు రెలు పట్టాలు తప్పడంతో ఓహెచ్‌సీ విద్యుత్ లైన్‌తో పాటుగా స్తంభాలు ధ్వంసమయ్యాయి. పట్టాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ మేరకు ఘటన స్థలానికి హుటాహుటినా రైల్వే సిబ్బంది చేరుకుని, పునరుద్ధరణ పనులు చేపట్టారు. రెండు రోజుల పాటు ఈ పనులను రైల్వే డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి పర్యవేక్షించారు. పట్టాలు తప్పిన వ్యాగన్లను తొలగించి, ఓహెచ్‌సీ విద్యుత్ లైన్, పట్టాలను పునరుద్ధరించారు.

కొత్తగా 6 ఇంటర్ పరీక్ష కేంద్రాలు

పాడేరు రూరల్: పాడేరు రెవెన్యూ డివిజన్‌కు కొత్తగా ఆరు ఇంటర్ పరీక్ష కేంద్రాలను మంజూరు చేస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇంటర్ పరీక్ష సమయంలో విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ గతంలో ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సానుకూలంగా స్పందించిన ఇంటర్ బోర్డు అధికారులు కొత్తగా ఆరు పరీక్ష కేంద్రాలను మంజూరు చేశారు. పాడేరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని సీలేరు, జీకే వీధి, కొయ్యూరు, చింతపల్లి, ముంచంగిపుట్టు, అనంతగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఈ పరీక్ష కేంద్రాలు మంజూరయ్యాయి. గతంలో ఆయా కళాశాల విద్యార్థులు సుదూర ప్రాంతాలకు వెళ్లి పరీక్షలు రాసేవారు. ఇప్పుడు కొత్తగా పరీక్ష కేంద్రాలు మంజూరు కావడంతో వారి రవాణా కష్టాలు తీరనున్నాయి.

వాల్తేర్ డివిజన్‌కు రికార్డు కేటాయింపులు

- బడ్జెట్‌లో అధిక నిధుల కేటాయింపు
- డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి వెల్లడి



బడ్జెట్ వివరాలు తెలియజేస్తున్న డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి

తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తర): ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రైల్వేకు అగ్రస్థానం లభించింది. వాల్తేర్ డివిజన్‌కు రికార్డు కేటాయింపులు చేశారని వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ అనూప్‌కుమార్ సత్పతి తెలిపారు. ఈ వివరాలను కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయా రాష్ట్రాలకు కేటాయించిన కేటాయింపుల వివరాలు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ.2800 కోట్లు కంటే ఎక్కువ వాల్తేర్ డివిజన్‌కు కేటాయించారని, ఇది కాకుండా సంయుక్త పనుల నిమిత్తం ఈస్ట్‌కోస్ట్‌రైల్వేకు మరో రూ.1,700 కోట్లు కేటాయించినట్లు డీఆర్‌ఎం తెలిపారు.

వాల్తేర్ డివిజన్ పరిధిలో ఆయా పనులకు 2023–24 బడ్జెట్ కేటాయింపులు

- వాల్తేర్ డివిజన్ పరిధిలో నూతనంగా నిర్మించనున్న కొత్త లైన్లకు రూ. 285కోట్లు కేటాయించారు. వీటిలో ముఖ్యంగా జైపూర్–మల్కన్‌గిరి, జైపూర్–నవరగంపూర్, నౌపడ– గుణుపూర్ బ్రాడ్‌గేజ్ లైన్లు ఉన్నాయి.
- డబ్లింగ్ (రెండో లైన్) పనులకు రూ.2,185 కోట్లు కేటాయించారు.
- కిరండూల్–జగదల్‌పూర్‌కు రూ.135 కోట్లు
- జగదల్‌పూర్ –కోరాపుట్‌కు రూ.170 కోట్లు
- విజయనగరం–సంబల్‌పూర్ మూడోలైన్‌కు రూ.920కోట్లు
- కొత్తవలస–కోరాపుట్‌కు రూ.410 కోట్లు,
- కోరాపుట్ – సింగపూర్ రోడ్ రూ. 550 కోట్లు

ట్రాఫిక్ సదుపాయాలు

- డివిజన్ పరిధిలో గల ట్రాఫిక్ సదుపాయాలైన యార్డ్ మోడలింగ్, ఇతర పనులకు కింద విధంగా కేటాయింపుల చేశారు. దీనికి గాను రూ.51.13 కోట్లు కేటాయించారు. రహదారి భద్రతా విభాగాలకు గాను లెవెల్ క్రాసింగ్స్‌కు, రోడ్ అండర్ బ్రిడ్జిలు, రోడ్ ఓవర్ బ్రిడ్జిలకు గాను సుమారు రూ.17.45 కోట్లు, ట్రాక్ రెన్యూవల్స్‌కు రూ.261కోట్లు, బ్రిడ్జి పనులకు రూ.9.93కోట్లు, సిగ్నల్ అండ్ టెలికంకు రూ.30.84 కోట్లు కేటాయించారు.
- వర్క్‌షాప్‌లు, నిర్మాణ యూనిట్‌లలో భాగంగా విశాఖలోని ఎలక్ట్రికల్ లోకో షెడ్‌కు రూ.20 లక్షలు, షెడ్ ఎక్స్‌టెన్షన్‌కు, ఇతర సదుపాయాలకు రూ.1.10 కోట్లు, సిబ్బంది సంక్షేమంలో భాగంగా క్వార్టర్స్ ఆధునికీకరణ, మరమ్మతులకు రూ. 15లక్షలు కేటాయించారు.

దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు...

విశాఖ కేంద్రంగా ప్రకటించిన దక్షిణ కోస్తా రైల్వే జోన్, కొత్త రాయగడ డివిజన్‌కు కలిపి రూ.10 కోట్లు మాత్రం కేటాయించారు.

నీరాక ఎంతో మధురం

- నీరాతో గిరిజనులకు ఆదాయం
- తాటి బెల్లం, చక్కెర తయారీపై శిక్షణ

నీరా నోరూరించే సహజసిద్ధ ప్రకృతి ప్రసాదం.. ఔషధ గుణాలతో కూడిన తాజా పానీయం.. అమృతాన్ని మరపించే దీని తియ్యని రుచికి ఎవ్వరైనా దాసోహమే.. ఇప్పుడిది గిరిజన కార్మికుల పాలిట వరం. దీని ద్వారా తాటి బెల్లం, చక్కెర తయారీ చేస్తూ ఆదాయ వనరుగా మార్చుకునేందుకు శిక్షణ ఇస్తున్నారు.



గిరిజనులకు శిక్షణ ఇస్తున్న అధికారి

రంపచోడవరం: తాటిని గిరిజనుల పాలిట కల్పతరువుగా మార్చేందుకు పందిరిమామిడి ఉద్యాన పరిశోధన కేంద్రం కృషి చేస్తోంది. తక్కువ కాలంలో తాటి చెట్లు పెరిగి, ఎక్కువ ఫలసాయాన్ని ఇచ్చేందుకు ఇక్కడ 30 ఏళ్లుగా తాటిపై పరిశోధనలు చేశారు. దేశ స్థాయిలో చెన్నై, ఆంధ్రాలోని పందిరిమామిడిలో మాత్రమే ఈ పరిశోధనలు జరుగుతున్నాయి. తాటి నుంచి నీరా తీయడం ద్వారా గిరిజనులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నారు.

తాటి చెట్టు నుంచి నీరా ఎలా సేకరిస్తారు

తాటి గెల నుంచి కల్లు కోసం దానిని పలుచగా కోస్తారు. గెల నుంచి చుక్క, చుక్కగా వచ్చే కల్లు సేకరించేందుకు ఒక్కో గెలకు ఒక్కో గొట్టం ఏర్పాటు చేస్తారు. అయితే ఇదే తాటి గెల నుంచి కూలింగ్ బక్స్‌లోకి సేకరిస్తే దానిని నీరా అంటారు. తాటి గెల నుంచి ముందుగా వచ్చే ఉత్పత్తి నీరా కాగా, అది కొద్ది సేపు ఎండలో ఉంటే కల్లుగా మారుతుంది. కల్లు మత్తును కలిగిస్తుంది. నీరా తియ్యగా రుచిగా ఉంటుంది. దీనిలో సుక్రోజ్ వంటి పిండి పదార్థాలు ఎక్కువగా ఉంటాయి. నీరాలో చక్కెరతోపాటు ఐరన్, పాస్పరస్, మినరల్స్, ఆస్కార్బిక్ ఆమ్లాలు ఉన్నాయి. నీరాలో గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉండటం వల్ల సుగరు ఉన్న వారు నీరా తీసుకోవచ్చు. నీరా నుంచి మాత్రమే తాటి బెల్లం, చక్కెర, బెల్లం పొడి, సిరప్ తయారీకి ఉపయోగపడుతుంది.



నీరా పానీయం



నీరా పానీయం ప్యాకెట్

40 గ్రామాల్లో గిరిజనులకు శిక్షణ

పందిరిమామిడి ఉద్యాన పరిశోధనా కేంద్రం ఆధ్వర్యంలో ఫుడ్ సైన్సు అండ్ టెక్నాలజీ శాస్త్రవేత్త డాక్టరు వీసీ వెంగయ్య గిరిజనులకు తాటి నీరా సేకరణ, నీరాతో బెల్లం, చక్కెర, సిరప్ తయారీలో శిక్షణ ఇస్తున్నారు. 40 గ్రామాల్లో తాటి కల్లు సేకరించే వారికి వీటి తయారీలో శిక్షణ ఇచ్చారు. టాటా ట్రస్టు ఆధ్వర్యంలో గిరిజనులకు నీరాతో తయారు చేసే ఉత్పత్తులపై శిక్షణ ఇచ్చారు. ప్రస్తుతం తెలంగాణాలో నీరాకు సంబంధించి ఎక్సైజ్ చట్టంలో సవరణ చేశారు. దీంతో నీరాను హెల్త్ ప్రొడక్టుగా మార్కెట్ చేసే దిశగా చర్యలు చేపట్టారు. ఏపీలోనూ ఎక్సైజ్ చట్టంలో సవరణకు కసరత్తు చేస్తోంది. తాటి నీరా నుంచి వివిధ ఉత్పత్తుల తయారీ కోసం భారతదేశంలోనే ఏకైక తాటి ఉత్పత్తుల తయారీ పరిశ్రమ పందిరిమామిడిలో నెలకొల్పారు. రూ. 1.54కోట్లుతో పైలెట్ ప్రాజెక్టుగా దీనిని ఏర్పాటు చేశారు.



తాటి బెల్లం

తాటి బెల్లానికి మార్కెట్‌లో మంచి డిమాండ్



తాటి ఉత్పత్తులకు, తాటి బెల్లానికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. తాటి బెల్లం రూ.400 పలుకుతోంది. గిరిజనులకు తాటి నీరా నుంచి బెల్లం తయారీపై శిక్షణ ఇస్తున్నాం. పందిరిమామిడిలోని తాటి ఉత్పత్తుల పరిశ్రమకు వచ్చి తాటి చక్కెర తయారు చేసుకునేందుకు అవకాశముంది. జీలుగు కల్లు నుంచి నీరా సేకరించి బెల్లం తయారు చేయవచ్చు. ఇటీవల చింతూరు మండలంలోని అనేక గ్రామాల్లో గిరిజనులకు జీలుగు నీరా నుంచి బెల్లం తయారీపై శిక్షణ ఇచ్చాం. ఎక్సైజ్ చట్టంలో సవరణ జరిగితే గిరిజనులకు నీరా ద్వారా చాలా లాభాలు వస్తాయి.

– వీసీ వెంగయ్య, ఫుడ్ సైన్సు అండ్ టెక్నాలజీ శాస్త్రవేత్త, హెచ్ఆర్ఎస్, పందిరిమామిడి

విహార యాత్రలో విషాదం

- ఘాట్ రోడ్డు లోయలో పడ్డ లారీ
- ఇద్దరు యువకుల మృతి
- నలుగురికి తీవ్ర గాయాలు



లారీ కింద మట్టిలో కూరుకుపోయి మృతి చెందిన నాగ సురేష్ చెయ్యి మాత్రమే కనిపిస్తున్న దృశ్యం



సంఘటన స్థలంలో నారాయణరెడ్డి మృతదేహం

మారేడుమిల్లి : మారేడుమిల్లి–చింతూరు ఘాట్ రోడ్డులో పాములేరు గ్రామ సమీపంలో పన్నెండు టైర్ల లారీ మలుపు తిరుగుతూ అదుపు తప్పి లోయలో పడింది. ఈ ప్రమాదంలో విహార యాత్రకు వచ్చిన ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందగా, మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, మృతుల స్నేహితులు తెలిపిన వివరాల ప్రకారం రాజమహేంద్రవరం నుంచి పౌరసరఫరాల బియ్యం లోడుతో చింతూరుకి వెళ్లిన లారీ, లోడు దింపి తిరిగి రాజమహేంద్రవరం వస్తోంది. మరోవైపు ప్రకాశం జిల్లా దర్శి గ్రామానికి చెందిన ఆరుగురు స్నేహితులు గురువారం పాపికొండలు విహార యాత్రకు వెళ్లారు. అనంతరం బస్సులో మారేడుమిల్లికి వచ్చారు. రాత్రి మారేడుమిల్లి క్యాపింట్ టెంట్ రిసార్ట్‌లో విడిది చేశారు. అనంతరం శుక్రవారం బస్సులో జలతరంగిణి జలపాతానికి చేరుకుని, జలపాతాన్ని సందర్శించి అక్కడి నుంచి అమృతధార జలపాతానికి వెళ్లారు. తిరిగి మారేడుమిల్లి రావడానికి మార్గంలో వేచి చూస్తుండగా చింతూరులో బియ్యం లోడు దింపి తిరిగి అటువైపుగా వస్తున్న లారీని ఆపి ఆరుగురు యువకులు ఎక్కారు. పాములేరు గ్రామ సమీపాన మలుపులో అదుపు తప్పి లారీ రోడ్డు పక్కనే ఉన్న చెట్లను ఢీకొని సుమారు 80 అడుగుల లోయలోకి దూసుకు పోయింది. ఈ ప్రమాదంలో పిచ్చెల నారాయణరెడ్డి (32), జి.నాగసురేష్ (23) అక్కడికక్కడే మృతి చెందారు. నాగిరెడ్డి చెన్నారెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, పెద్దసూరా సుబ్బారెడ్డితోపాటు డ్రైవర్ వెంకటేశ్వరస్వామికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని అంబులెన్స్‌లో రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న మారేడుమిల్లి సీఐ శ్రీనివాసరావు, ఎస్సైలు రాము, జ్వాలాసాగర్ సంఘటనా స్థలానికి చేరుకుని లారీ, క్యాబ్ యూనియన్ సభ్యులతో కలిసి తక్షణ సహాయక చర్యలు చేపట్టారు. నాగ సురేష్ మృతదేహం లారీ ఎదుటి భాగం కింద మట్టిలో కూరుకుపోయింది. లోయలో పడిపోవడంతో వెలికితీత చర్యలకు కాస్త ఇబ్బంది ఏర్పడింది. మృతుడు పిచ్చెల నారాయణరెడ్డి ఒడిశా రాష్ట్రం రామ్‌రంగపూర్‌లో రైల్వే స్టేషన్‌లో టీసీగా పని చేస్తున్నాడు. నాగ సురేష్ ఎంసీఏ చదువుతున్నాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి మారేడుమిల్లి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో భర్త మృతి, భార్యకు గాయాలు



సంఘటన స్థలంలో ఆధారాలు సేకరిస్తున్న దేవరాపల్లి ఎస్‌ఐ నాగేంద్ర



తీవ్రగాయాలతో కె.కోటపాడులో చికిత్స పొందుతున్న లక్ష్మణ, సంజీవరావు



మృతి చెందిన బాలిబోయిన సన్నిబాబు

దేవరాపల్లి : దేవరాపల్లి–కొత్తవలస రోడ్డులో చిన్న గుడిపాల జంక్షన్ వద్ద జీపు రెండు ద్విచక్ర వాహనాలను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భర్త మృతి చెందగా, భార్య తీవ్ర గాయలపాలైన విషాద ఘటన చోటుచేసుకుంది. ఇదే ప్రమాదంలో మరో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. మృతుడు సహా ముగ్గురు క్షతగాత్రులు వేపాడ మండలానికి చెందినవారు. ఘటనకు సంబంధించి ఎస్‌ఐ డి. నాగేంద్ర తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వేపాడ మండలం చిన గుడిపాలకు చెందిన భార్యభర్తలు బాలిబోయిన సన్నిబాబు, దేముడమ్మ ద్విచక్ర వాహనంపై దేవరాపల్లి వైపు వస్తున్నారు. చినగుడిపాల జంక్షన్ వద్ద దేవరాపల్లి వైపు మలుపు తిరుగుతుండగా దేవరాపల్లి నుండి ఆనందపురం వైపు వెళ్తున్న జీపు బలంగా ఢీకొట్టింది. అదే సమయంలో ఆనందపురం వైపు నుంచి ద్విచక్ర వాహనంపై వస్తున్న వేపాడ మండలం భర్తవానిపాలెంకు చెందిన గండి సంజీవరావు, సిహెచ్. లక్ష్మణను సైతం జీపు ఢీకొట్టింది. దీంతో ఆ రెండు వాహనాలపై ఉన్నవారంతా తీవ్ర గాయాలతో చెల్లాచెదురుగా పడిపోయారు. వారిని స్థానికులు 108 వాహనంలో కె.కోటపాడు కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన చిన్నగుడిపాలకు చెందిన బాలిబోయిన సన్నిబాబు మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. సన్నిబాబు భార్య దేముడమ్మ కాలు, చెయ్యి విరిగిపోవడంతో స్థానికంగా ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నంలోని కేజీహెచ్‌కు తరలించారు. భర్తవానిపాలేనికి చెందిన సంజీవరావు, లక్ష్మణకు తీవ్ర గాయాలయ్యాయి. తన కళ్ల ముందే భర్త మృతి చెందడంతో తీవ్ర గాయాలతో ఉన్న భార్య దేముడమ్మ కన్నీరు మున్నీరుగా విలపించింది. ప్రమాదానికి కారణమైన జీపు డ్రైవర్ పరారవగా, జీపు అనంతగిరి మండలం కివర్ల శివారు తంగిడి బంద గ్రామానికి చెందినదిగా పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు.

ఈ మేరకు ఎస్‌ఐ డి. నాగేంద్ర సంఘటన స్థలాన్ని సందర్శించి ప్రమాదానికి కారణాలను సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహానికి అనకాపల్లి ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించామని ఎస్‌ఐ తెలిపారు.

11న లోక్ అదాలత్



మాట్లాడుతున్న రెడ్డి ప్రసన్న

చింతపల్లి రూరల్: ఈ నెల 11న స్థానిక జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో జాతీయ లోక్ అదాలత్ కోర్టును ఏర్పాటు చేయనున్నట్లు న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ రెడ్డి ప్రసన్న తెలిపారు. ఈ మేరకు చింతపల్లి, గూడెంకొత్తవీధి, కొయ్యూరు మండలాలకు సంబంధించిన పోలీసు అధికారులతో ఆమె సమావేశమయ్యారు. కోర్టు ఆవరణలో రాజీకొచ్చిన క్రిమినల్ కేసులను అదాలత్ కోర్టులో పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు. జీకేవీధి సీఐ అశోక్ కుమార్, మంప, అన్నవరం ఎస్‌ఐలు లోకేష్, కిరణ్ పాల్గొన్నారు.

అమ్మాయికి 17.. అబ్బాయికి 15..

- బాల్య వివాహం అడ్డుకున్న ఐసీడీఎస్ అధికారులు



గ్రామస్తులతో చర్చిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

ముంచంగిపుట్టు: మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ కిందుగూడ గ్రామంలో బాల్య వివాహాన్ని ఐసీడీఎస్ అధికారులు శుక్రవారం అడ్డుకున్నారు. అమ్మాయికి 17 సంవత్సరాలు, అబ్బాయికి 15 సంవత్సరాలు కాగా, వీరిద్దరికీ పెళ్లి చేసేందుకు సిద్ధమవ్వడం విశేషం. లక్ష్మీపురం పంచాయతీ సుత్తిగూడ గ్రామానికి చెందిన బాలికకు, కిందుగూడ గ్రామానికి చెందిన బాలుడికి వివాహం చేస్తున్నట్లు సమాచారం అందుకున్న స్థానిక ఐసీడీఎస్ సీడీపీవో ఎస్. రాజేశ్వరి, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ సిబ్బంది, మహిళా పోలీసు హుటాహుటిన అక్కడకు చేరుకుని అడ్డుకున్నారు. పెళ్లికూతురు, పెళ్లికొడుకు తల్లిదండ్రులతో మాట్లాడారు. బాల్య వివాహం వల్ల కలిగే దుష్ఫలితాలపై వివరించారు. అమ్మాయికి 18 ఏళ్లు, అబ్బాయికి 21 ఏళ్లు నిండిన తర్వాత వివాహం చేయాలన్నారు. దీన్ని అతిక్రమిస్తే నాన్ బెయిలబుల్ నేరమని, పోక్సో చట్టం ప్రకారం సైతం కఠినమైన శిక్షలు విధించే అవకాశం ఉందని ఐసీడీఎస్ సీడీపీవో హెచ్చరించారు. పెళ్లికూతురు, పెళ్లికొడుకు తల్లిదండ్రుల నుంచి అంగీకార పత్రాలు తీసుకున్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సత్యనారాయణమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు దేవి, లక్ష్మి, నర్సమ్మ పాల్గొన్నారు.

ఊరూవాడా పప్పు కొత్త పండగ



వణకరాయి గ్రామంలో చిన్నారుల కావిడి ఊరేగింపు

రాజవొమ్మంగి: గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో విచిత్రంగా ఉంటాయి. అయితే నేటికీ వాటిని కాపాడుకుంటూ తమ పిల్లలకు నేర్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. మండలంలోని దాకరాయి, వణకరాయి, శరభవరం తదితర గ్రామాల్లో శుక్రవారం గిరిజన సంప్రదాయబద్ధంగా పప్పు కొత్త పండగ జరిగింది. గంగాలమ్మ విగ్రహాన్ని కావిడిలో పెట్టి చిన్నారులతో ఊరేగించారు. వణకరాయి రైతులు తమ పొలంలో పండిన కంది, పెసర, అలసందలు, ఉలవలు, మినుములు వండి గ్రామదేవతకు నివేదించారు. ఇలా అన్ని రకాల పప్పు దినుసులతో ప్రసాదాలు తయారు చేసి దైవానికి నివేదించి ప్రసాదంగా స్వీకరించారు. పండిన పంటను మొదట ఈ విధంగా ఇష్టదైవానికి నివేదించిన తర్వాతే ఏడాది పొడవున భుజిస్తామని వారు తెలిపారు. కొత్త ధాన్యాన్ని బియ్యంగా చేసి పరమన్నంగా వండుతామని, ఆ తర్వాత మాత్రమే ఏడాది పొడవునా ప్రధాన ఆహారంగా స్వీకరిస్తామన్నారు.

భక్తిశ్రద్ధలతో రాజులబాబుల పండగ

గ్రామాల్లో అడవి రాజుల బాబుల పండగను గిరిజనులు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. సీతారాములకు పుట్టిన బిడ్డలు లవకుశలనే అడవి రాజులబాబులుగా కొలుస్తారని ప్రతీతి. రోజంతా ఉపవాసం ఉన్న చిన్నారులకు లవకుశ వేషాలు వేసి పసుపు కుంకుమ అద్దారు. వారితో పెద్దలు తమ పొలాల్లో రాజులబాబులకు పూజలు చేయించారు. అనంతరం చుట్టు పక్కల రైతులు, స్నేహితులు, బంధువులు, కులమతాలకు అతీతంగా పిలిచి సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేయడం ఈ పండుగ విశిష్టత. నిత్యం అడవులు, పొలాల్లో తిరిగే మమ్ము మీరే కాపాడాలంటూ రాజులబాబులకు పూజలు చేయడం మన్యంలో ఆచారం.

జీవాల ప్రాణాలకు సీఎం జగన్ భరోసా



అంబులెన్స్‌లో పశువులకు అందించే సేవలపై డెమోను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

- అత్యవసర పశువైద్య సేవలు అందుబాటులోకి..
- అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ
- డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ అంబులెన్స్ ప్రారంభం

పెదబయలు: 108 అంబులెన్స్ మాదిరిగానే జీవాలకు అత్యవసర వైద్య సేవల కోసం డాక్టర్ వైఎస్సార్ సంచార పశువైద్య ఆరోగ్య సేవ అంబులెన్స్ (1962) అందుబాటులోకి వచ్చిందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ తెలిపారు. శుక్రవారం పెదబయలు పశువైద్య ఆరోగ్య కేంద్రంలో డాక్టరు వైఎస్సార్ సంచార పశువైద్య ఆరోగ్య సేవ అంబులెన్స్‌ను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మనుషుల ప్రాణాలకే కాదు, జీవాలకు పాడి రైతుల సంక్షేమానికి కృషి చేస్తున్నారన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని సంక్షేమం మన రాష్ట్రంలో చేపడుతున్నారని, పాడి పరిశ్రమ అభివృద్ధి, తద్వారా పాడి రైతులకు లాభం చేకూరుతుందన్నారు. అరకు నియోజకవర్గంలో అరకులోయ, పెదబయలు మండలాలకు రూ.2 కోట్లకు పైగా నిధులు వెచ్చించి అంబులెన్స్ మంజూరు చేశారన్నారు. పశువులు, గొర్రెలు, మేకలు ఇతర జీవాలకు అత్యవసర సేవలు ఉంటే టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రతీ సచివాలయానికి పశుసంవర్థక శాఖ సహాయకులు అందుబాటులో ఉన్నారని, వారికి సమాచారం అందించి సేవలు పొందాలని కోరారు. పశుసంవర్థక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ వెంకటస్వామి, పశు సంవర్థక శాఖ ఏడీ రాజా రవికుమార్ మాట్లాడుతూ జీవాలకు సీజనల్‌గా ప్రబలే వ్యాధులు, వాటికి అందించాల్సిన చికిత్స, అత్యవసర సేవల కోసం 1962 టోల్ ఫ్రీ సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వాహనంలోనే 36 రకాల టెస్టులు చేస్తారని, వైద్యాధికారితోపాటుగా అసిస్టెంట్, డ్రైవర్ ఉంటారన్నారు. పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల ఎంపీపీలు బొండా వరహాలమ్మ, అరిసెల సీతమ్మ, జెడ్పీటీసీ కూడా బొంజుబాబు, పార్టీ నాయకులు గంపరాయి సూరయ్య, కనకరాజు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దాలి

- రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఇంజినీరింగ్ కాలేజీ యాజమాన్యం

ఎటపాక: విద్యాభివృద్ధికి ప్రభుత్వం చేస్తున్న కృషిని గ్రహించి విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దాలని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి కోరారు. మండలంలోని డాక్టర్ పాల్‌రాజ్ ఇంజినీరింగ్ కాలేజీ, లక్ష్మీదేవిపేటలోని ప్రభుత్వ గిరిజన ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారికి అందుతున్న వసతులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన విద్యా బోధన అందించి, విద్యార్థులను ప్రోత్సహించాలని ఇంజినీరింగ్ కాలేజీ చైర్మన్ వి. వరలక్ష్మి, కార్యదర్శి జకరయ్యలకు సూచించారు. కళాశాల సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి పత్రం అందించారు. లక్ష్మీదేవి పాఠశాలలో వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీనివాసరాజు ఏర్పాటు చేసిన మినీ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఎమ్మెల్యే, అడ్డతీగల సొసైటీ అధ్యక్షుడు తోట రాజేశ్వరరావులను ఇంజినీరింగ్ కాలేజీ యాజమాన్యం శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేసింది. జెడ్పీటీసీ ఉబ్బా సుస్మిత, ఎంపీపీ కాక కామేశ్వరి, ఎటపాక సొసైటీ అధ్యక్షుడు ఆకుల వెంకటరామారావు, పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి మంత్రి ప్రగడ నర్సింహారావు, కురినాల వెంకట్, దామెర్ల రేవతి, శివ పాల్గొన్నారు.